TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 101 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ బుధవారం.05.11.2025 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD




# ఆ ముగ్గుర్ని అరెస్టు చేయాలి




జూబ్లీహిల్స్ :అమృత్ తెలంగాణ: ''కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు సీబీఐకి అప్పగిస్తే.. మూడు నెలలైనా కేసు పెట్టలేదు. బీఆర్ఎస్, బీజేపీది ఫెవికాల్ బంధం కాకపోతే.. మీరు, వాళ్లు ఒక్కటి కాదంటే ఈనెల 11లోగా కాళేశ్వరం కేసులో సీబీఐ ఎఫ్ఐఆర్ చేసి.. కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌ను అరెస్ట్ చేయాలి'' అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రహమత్‌నగర్ డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్ క్రాస్ రోడ్ (పీజేఆర్ సర్కిల్) వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో సీఎం ప్రసంగించారు. కాళేశ్వరం కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంగా మారిందని బీజేపీ నేతలు పదే పదే చెప్పారని గుర్తు చేశారు. 'కాళేశ్వరం కేసును సీబీఐకి పంపిస్తే 48 గంటల్లో తండ్రీ కొడుకులను జైలుకు పంపిస్తామన్నారు. మీరు, వాళ్లు ఒక్కటి కాకపోతే, కేసీఆర్, హరీశ్, కేటీఆర్‌ని ఎందుకు అరెస్టు చేయడం లేదు. ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్‌ను అరెస్ట్ చేసేందుకు ఎందుకు అనుమతి ఇవ్వడం లేదు.. ఇందులో మీ చీకటి ఒప్పందం ఏంటి?'' అని బీజేపీని, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సీఎం ప్రశ్నించారు. 'చీకటి ఒప్పందం చేసుకుని జూబ్లీహిల్స్‌లో బీజేపీ బీఆర్ఎస్‌కు పరోక్ష మద్దతు ఇస్తోందన్నారు. ఎందుకంటే రానున్న రోజుల్లో బీఆర్ఎస్ బీజేపీలో విలీనం అవుతుందని, ఇది తాను అంటున్నది కాదని. వాళ్ల ఆడబిడ్డ చెబుతున్నదేనని చెప్పారు.

సెంటిమెంట్ పేరుతో ఓట్లు దండుకోవాలనే..

'సిట్టింగ్ ఎమ్మెల్యే చనిపోతే ఆయన సతీమణిని గెలిపించాలని అడుగుతున్నారు. కానీ ఇదే కేసీఆర్.. 2007లో పీజేఆర్ మరణించినప్పుడు ఏం చేశారు' అని ప్రశ్నించారు. 'ఆనాడు పీజేఆర్ రాజకీయ ప్రత్యర్థి అయిన చంద్రబాబు నాయుడు సైతం విజ్ఞత ప్రదర్శించి, ఏకగ్రీవానికి అంగీకరించి పోటీకి పెట్టలేదు. కానీ కేసీఆర్ మాత్రం సెంటిమెంట్ లేదంటూ పీజేఆర్ కుటుంబంపై అభ్యర్థిని నిలబెట్టారు. మద్దతు అడగడానికి వెళ్లిన పీజేఆర్ భార్యను, కుటుంబాన్ని మూడు గంటలపాటు గేటు బయట నిలబెట్టిన దుర్మార్గుడు కేసీఆర్' అని రేవంత్‌రెడ్డి విమర్శించారు. పీజేఆర్ కుటుంబంపై పోటీకి పెట్టినందుకు బీఆర్ఎస్ నేతలు రహమత్‌నగర్ చౌరస్తాలో ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాకే జూబ్లీహిల్స్‌లో ఓట్లు అడగాలని సీఎం డిమాండ్ చేశారు.

కేటీఆర్‌కు నైతిక హక్కు లేదు

సొంత చెల్లికి ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని ఇంటి నుంచి బయటకు పంపిన దుర్మార్గుడు కేటీఆర్ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. మహిళా సెంటిమెంట్ గురించి మాట్లాడే నైతిక హక్కు వారికి లేదన్నారు. పదేండ్ల పాలనలో ఐదేండ్లపాటు మంత్రివర్గంలో ఒక్క మహిళకూ స్థానం ఇవ్వని కేసీఆర్, కేటీఆర్‌కు మహిళల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇందిరాగాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వంటి నేతలకు నాయకత్వం ఇచ్చిందని, తమ మంత్రివర్గంలో సీతక్క, కొండా సురేఖ వంటి వారికి గౌరవం ఇచ్చిందని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జూబ్లీహిల్స్‌లోనే 14,159 కొత్త రేషన్ కార్డులు ఇచ్చామన్నారు. ''మేము 200 యూనిట్ల ఉచిత కరెంట్, సన్న బియ్యం, ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే, బీఆర్ఎస్ నాయకులు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి ఆ పథకాన్ని ఆపాలని చూస్తున్నారు' అని విమర్శించారు. 'మీ రేషన్ కార్డు రద్దు చేయడానికా బీఆర్ఎస్‌ను గెలిపించేది? మీ ఉచిత కరెంట్ ఆపడానికా? ఆడబిడ్డల బస్సు ప్రయాణం ఆపడానికా?' అని ప్రజలను ప్రశ్నించారు. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే, ఎన్నికల తర్వాత జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి 4వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. అలాగే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్న మిత్రపక్షాలైన సీపీఐ(ఎం), సీపీఐ, ఎంఐఎం,టీజేఎస్ పార్టీలకు ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారుఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అజారుద్దీన్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్, ఇతర నేతలు ఉన్నారు.

# ఎకరాకు 25 క్వింటాళ్ల మక్కలు కొనాలి




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ఎకరాకు 25 క్వింటాళ్ల వరకు మక్కలను కొనుగోలు చేయాలని మార్క్‌ఫెడ్ ఎమ్‌డీని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. రైతులు, ప్రజాప్రతినిధులు చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర కాటన్ అసోసియేషన్ బృందంతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలో 214 మక్కల కొనుగోలు కేంద్రాల్ని ప్రారంభించాలని నిర్ణయించామన్నారు. ఇప్పటికే 125 కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. 23,131 మెట్రిక్ టన్నుల మక్కల్ని సేకరించామన్నారు. రాష్ట్రంలో 2,500 కోట్లతో మక్కల్ని కొనుగోలు చేస్తామన్నారు. అలాగే ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేస్తామని సీసీఐ నిబంధన విధించడం సరికాదన్నారు. పత్తి రైతులకు అన్యాయం చేయొద్దని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. జిన్నింగ్ మిల్లర్ల సమస్యల్ని పరిష్కరించాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోలు ప్రక్రియలు సవ్యంగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర కాటన్ అసోసియేషన్ అధ్యక్షులు రవీందర్ రెడ్డికి సూచించారు. ఈ సందర్భంగా సీసీఐ సీఎమ్‌డీ లలిత్‌కుమార్ ఉప్తాతో ఫోన్‌లో సంప్రదించారు. సీసీఐ అవలంబిస్తున్న ఎల్1, ఎల్2, ఎల్3 అలాట్‌మెంట్ విధానాన్ని ఎత్తేయాలనీ, అన్ని జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లకు అనుమతులివ్వాలని విన్నవించారు. జిన్నింగ్ మిల్లులు మూతపడే పరిస్థితులు తీసుకురావొద్దని కోరారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా పత్తి కొనుగోళ్లలో సాంకేతికంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమనీ, రైతులు ఉత్పత్తి చేసిన పంటలకు ఇబ్బందులు లేకుండా కనీస మద్దతు ధర వద్ద కొనుగోళ్లు చేయాలని ఆదేశించారు. తేమ శాతం, స్లాట్ బుకింగ్ వంటి అంశాలపై రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి వివరించారు. ఎకరాకు ఏడు క్వింటాళ్ల కొనుగోలు పరిమితిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి తగిన సవరణలు చేయాలని కోరారు. సీసీఐ కొత్త నిబంధనలు, జిన్నింగ్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజరు చొరవ తీసుకోవాలని కోరారు. రైతాంగానికి సహాయం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందనే విశ్వాసం తనకుందన్నారు. సమీక్షలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి. గోపి, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మి బాయి, వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్ష పత్రాల పంపిణీ

రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల నుంచి వచ్చిన రైతులకు భూసార పరీక్షల పత్రాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అందజేశారు. రైతుల నుద్దేశించి మంత్రి మాట్లాడుతూ.. ప్రతి రైతు భూసార పరీక్ష చేయించుకోవడం వలన వారి భూములలో ఎంత శాతం పోషకాలు ఉన్నాయో తెలుస్తాయన్నారు. తద్వారా పంటల సాగుకు అనుకూలంగా ఎంత మోతాదులో ఎరువులు అవసరం అవుతుందో తెలుసుకునే వీలు కలుగుతుందని చెప్పారు. భూసార పరీక్షలను

చేయించుకోవడం ద్వారా ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన పెరిగి, ఎరువులపై రైతులు చేసే ఖర్చు తగ్గడమే కాకుండా భూమి యొక్క ఆరోగ్యం కూడా కాపాడినట్లు అవుతుందని అన్నారు. శాటిలైట్ టెక్నాలజీతో మట్టి పరీక్షలు చేసే కంపెనీలతో ప్రభుత్వం చర్చలు జరుపుతున్నదని తెలిపారు. నీటి వసతి కలిగిన రైతులు వరి, పత్తి పంటల బదులు ఆయిల్ పామ్ పంట సాగు చేపట్టాలనీ, ఆయిల్ పామ్‌లో అంతర పంటలుగా కోకో, మిరియాలు, వక్క, సాగు చేయడం వలన ఒకే భూమిలో ఎక్కువ రకాలైన పంటల సాగు చేసి, అధిక ఆదాయం పొందవచ్చునని వివరించారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో మంత్రులు

బంజారా హిల్స్ :అమృత్ తెలంగాణ: ప్రజా పాలన ప్రజల క్షేమం కోరుతోందనీ, మాట ఇచ్చినట్టే పనులు చేశామని మంత్రులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్లు తెలిపారు. మంగళవారం శ్రీనగర్ కాలనీ లోని జీహెచ్ఎంసీ పార్క్ లో ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, స్థానిక కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ ముఖ్య నేతలతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. హైదరాబాద్ మహా నగరాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులు,సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. రాబోయే రోజుల్లో నగరంలో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతానికి అమలు చేయబోయే భవిష్యత్తు ప్రణాళికలను ఓటర్లకు వివరించారు. అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఓటర్లకు వివరించారు. బీఆర్ఎస్, బీజేపీ మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించినిరంతరం జూబ్లీహిల్స్ ఓటర్లకు



అందుబాటులో ఉండే నవీన్ యాదవ్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# రిమ్స్ ను పరిశీలించిన కల్వకుంట్ల కవిత



ఆదిలాబాద్ :అమృత్ తెలంగాణ: రిమ్స్ లో రోగులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. మంగళవారం రిమ్స్ ను పరిశీలించి రోగుల ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ఇక్కడి ప్రభుత్వ హాస్పిటల్ లో సౌకర్యాలు ఎలా ఉన్నాయన్నది చూడటానికి వచ్చామన్నారు. ఇక్కడున్న జూనియర్ డాక్టర్స్, నర్సులు పేదవాళ్ల కోసం పనిచేస్తున్నారని, పేషెంట్లకు ఇబ్బంది కాకుండా ప్రతి ఒక్కరికీ వైద్యం అందిస్తున్నారన్నారు. అలాంటి జూనియర్ డాక్టర్స్ డిమాండ్లు కొన్ని ఉన్నాయని వాటిని ప్రభుత్వం తీర్చాలని అన్నారు. హాస్పిటల్ లో శానిటేషన్ చాలా దారుణంగా ఉందని చాలా వాసన వస్తుందని పేర్కొన్నారు. దీని గురించి డైరెక్టర్ కు చెప్పమని పాత ఏజెన్సీ మార్చామని చెప్పారని పేర్కొన్నారు. రోగులకు ఇక్కడకు వచ్చాక వారికి మంచి వాతావారణం ఉండాలని, గతంలో శానిటేషన్ కోసమే ప్రత్యేక బడ్జెట్ ఇచ్చే వాళ్లమని ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా చేశారన్నారు. ఇక్కడ పేషెంట్లను నాగ్ పూర్ కు వెళ్లామంటున్నారని తెలిసిందని హాస్పిటల్ లో కార్డియాలజిస్ట్ ను కచ్చితంగా నియమించాలన్నారు. ఆదిలాబాద్ లో పెద్ద ఎత్తున క్యాన్సర్ కేసులు కూడా నమోదవుతున్నాయని ఇన్ని అడవులతో మంచి వాతావారణం ఉన్న జిల్లాలో క్యాన్సర్ కేసులు రావటమా అని ప్రశ్నించారు. పెద్ద ఎత్తున పెరుగుతున్న క్యాన్సర్ కేసులపై కమిటీ వేయాలని జిల్లా ప్రజలకు సంబంధించి హెల్త్ ప్రొఫైల్ స్టడీ చేయాలని కోరుతున్నా. రిమ్స్ హాస్పిటల్ లో విద్యార్థులు సూసైడ్ చేసుకుంటున్న పరిస్థితులు ఉన్నాయని వారికి సరైన రెస్ట్ రూమ్స్, ఫెసిలిటీస్ లేవన్నారు. మన తెలంగాణ ఆరోగ్యాన్ని కాపాడే విద్యార్థులకు మంచి సౌకర్యాలు కల్పించాలని ఆరోగ్య శాఖకు పెద్ద ఎత్తున బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. హాస్పిటల్ లో ఒక లిఫ్ట్ పనిచేయకపోవటంతో రోగులు ఇబ్బంది పడుతున్నారని ఎక్కువ మంది మైనార్టీ వర్గానికి చెందిన వారు హాస్పిటల్ కు వస్తున్నారని వారికి మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రభుత్వం త్వరితగతిన హాస్పిటల్ లో అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కవిత వెంట నాయకులు ఉన్నారు.

# సీఎంఎస్-03 ప్రయోగం సక్సెస్

శ్రీహరికోట :అమృత్ తెలంగాణ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) నిర్వహించిన 'సీఎంఎస్-03' ప్రయోగం విజయవంతమైంది. 'ఎల్‌వీఎం3-ఎం5' వాహక నౌక ద్వారా ఈ సమాచార ఉపగ్రహాన్ని జియో సింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లోకి శాస్త్రవేత్తలు విజయవంతంగా ప్రవేశపెట్టినట్టు ఇస్రో చైర్మెన్ నారాయణన్ తెలిపారు. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఆదివారం సాయంత్రం 5.26 నిమిషాలకు ఈ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ఉపగ్రహం బరువు 4,410 కిలోలు. భారత భూభాగం నుంచి స్వదేశీ రాకెట్ ద్వారా ఈ కక్ష్యలోకి ప్రయోగించిన శాటిలైట్లన్నింటిలోకీ ఇదే అత్యంత బరువైనది. ''సీఎంఎస్-03 ప్రయోగం విజయవంతంకావడం ఆనందంగా ఉంది. ఇందులో కీలకపాత్ర పోషించిన అందరికీ అభినందనలు. ఈ ప్రయోగంతో భారత్ మరో ఘనత సాధించింది. శాస్త్రవేత్తలు, సిబ్బంది కృషి వల్లే ఇదంతా




సాధ్యమైంది. ఆత్మనిర్భర్ భారత్ దిశగా ఇస్రో అడుగులు వేస్తోంది'' అని ఇస్రో చైర్మెన్ చెప్పారు.

సముద్ర వాతావరణ పరిస్థితులపై కన్ను

సీఎంఎస్-03 ఉపగ్రహం ద్వారా సమాచార వ్యవస్థ మెరుగుపడటంతో పాటు సముద్ర వాతావరణ పరిస్థితులను తెలుసుకునే వెసులుబాటు కలగనుంది. ప్రధానంగా భారత నౌకాదళం కోసం దీన్ని రూపొందించారు. సాగర జలాల్లో మోహ రించిన మన యుద్ధనౌకలు, జలాంతర్గాములు, భూ నియంత్రణ కేంద్రాలతో భద్రమైన కమ్యూనికేషన్లు సాగించేందుకు ఈ శాటిలైట్ తోడ్పాటు అందిస్తుంది. భారత తీరం నుంచి 2వేల కిలోమీటర్ల దూరం వరకూ విస్తరించిన సాగరజలాల్లో సేవలు అందించగలదు. దీన్ని జీశాట్-7ఆర్ అని కూడా పిలుస్తారు. 2013 నుంచి సేవలు అందిస్తున్న జీశాట్-7 స్థానంలో దీన్ని ప్రయోగించారు.

# ఆదిలాబాద్ జిల్లా అన్ని రంగాల్లో ముందుండాలి జిల్లా కలెక్టర్ రాజార్షి షా




సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్




ఆదివాసుల గిరిజన నృత్యం దృశ్యం





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి జిల్లా యువత చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించి ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు మంగళవారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలు కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ముందుగా విద్యార్థులు, యువత, కళాకారులు ఆకర్షణీయమైన సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఆదిలాబాద్ జిల్లా అన్ని రంగాల్లో ముందుండాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థి దశలోనే మంచి మార్గంలో నడవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. అందుకే జిల్లాలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమంను ప్రారంభించామని, ఆరోగ్యంగా ఉంటేనే విద్యలో, జీవితంలో విజయం సాధించవచ్చని అన్నారు. ఉన్నత విద్యాపరంగా విద్యార్థులు ఐఐటీ, నీట్, జెఈఈ లాంటి జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంవారి స్టార్ 50, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పథకాలు అమలులో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాలను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలు, సంప్రదాయ కళల పట్ల యువతకు అవగాహన కల్పించాలన్నారు. గుస్సాడీ నృత్యానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కళాకారులు పొందిన పద్మశ్రీ పురస్కారం మన గర్వకారణమని తెలిపారు. అలాగే మహువ లడ్డుకి ఇటీవల లభించిన జాతీయ స్థాయి గుర్తింపు, ప్రధాని మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రస్తావన మన జిల్లాకు ప్రత్యేక గౌరవం తీసుకొచ్చాయని కలెక్టర్ గుర్తుచేశారు. మారుమూల ప్రాంతాల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఇన్నోవేషన్ స్టాళ్లను కలెక్టర్ సందర్శించి విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, జిల్లా బిసి సంక్షేమ అధికారి రాజలింగు, డివైఎస్ఓ శ్రీనివాస్, అధికారులు, విద్యార్థులు, యువత, పోషకులు, కవులు, కళాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా పత్తి కొనుగోళ్లపై జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో పత్తి కొనుగోళ్లు dŸ good good fcజావుగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాజార్షి షా తెలిపారు.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన సీసీఐ, జిన్నింగ్ మిల్లుల యజమానులు, మార్కెటింగ్, వ్యవసాయ, రవాణా, అగ్నిమాపక తదితర శాఖల అధికారులతో పత్తి కొనుగోళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లులు నవంబర్ 6వ తేదీ నుండి నిరవధికంగా మూసివేయనున్నట్లు తెలంగాణా కాటన్ జిన్నింగ్ మిల్స్ అసోసియేషన్ ప్రకటించిన నేపథ్యంలో, జిల్లా స్థాయిలో పరిస్థితులను సమీక్షించామని తెలిపారు. సీసీఐ వారు జిన్నింగ్ మిల్లులకు జాబ్ వర్క్ కేటాయింపును L1, L2 విధానంలో నిర్వహించడం పట్ల మిల్లుల యజమానులు అభ్యంతరం వ్యక్తం చేశారని, ఈ అంశంపై జిల్లా స్థాయి కమిటీ చర్చించి అభిప్రాయాలను రాష్ట్ర స్థాయికి నివేదించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ముంబాయి) స్థాయిలో తీసుకునే తుది నిర్ణయం ప్రకారం పత్తి కొనుగోళ్లు కొనసాగుతాయని తెలిపారు. రైతుల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని కొనుగోలు ప్రక్రియ ఎటువంటి అంతరాయం లేకుండా జరిగేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే సీసీఐ వారు నవంబర్ 3వ తేదీ నుండి ఎకరాకు పత్తి కొనుగోలు పరిమితిని 11.74 క్వింటాళ్ల నుంచి 7 క్వింటాళ్లకు తగ్గించినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి మార్కెటింగ్ శాఖ నిర్ణయం వచ్చిన తరువాత, సాఫ్ట్‌వేర్‌లో ఎకరానికి 7 క్వింటాళ్లకు మించి దిగుబడి ఉన్న రైతుల పత్తి కొనుగోళ్లు సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారి (AEO) ధృవీకరణతోనే అనుమతిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని పత్తి మార్కెట్‌యార్డుల్లో కొనుగోలు కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని, తగిన రవాణా, అగ్నిమాపక, భద్రతా చర్యలను చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, విశ్రాంతి ఏర్పాట్లు, పారదర్శకతకు కట్టుబడి ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, అదనపు ఎస్పీ సురేందర్ రావు, మార్కెటింగ్ అధికారి గజానన్, జిన్నింగ్‌మిల్లుల యజమానులు, పాల్గొన్నారు.

# ఆసుపత్రులు, వెటర్నరీ హాస్పిటల్స్, పరిశ్రమల్లో ఉత్పత్తి అయ్యే మానవ, రసాయన వ్యర్థాలను సాధారణ చెత్తలో కలపరాదని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు.



సమావేశంలో పాల్గొన్న వైద్య అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి: మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో బయో మెడికల్ వెస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ – 2016 అమలుపై జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బయో మెడికల్ వ్యర్థాలను గుర్తింపు పొందిన సంస్థల ద్వారా మాత్రమే శాస్త్రీయ పద్ధతిలో ధ్వంసం చేయాలని సంబంధిత విభాగాల అధికారులకు సూచించారు. ఆసుపత్రులు, వెటర్నరీ విభాగాలు, పరిశ్రమలు ఉత్పత్తి చేసే వ్యర్థాలను మున్సిపల్ చెత్తలో కలిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రాణాంతకమని, ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పు కలగవచ్చని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డా. నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ డా. జై సింగ్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ రాజు, కమిటీ సభ్యులు, బయో మెడికల్ వెస్ట్ మేనేజ్‌మెంట్ సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# వరద నష్ట ప్రభావిత ప్రాంతాల్లో మరమ్మత్తులు త్వరితగతిన పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్




సమావేశం హాజరైన ఇంజనీరింగ్ అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి వర్షాకాలం భారీ వర్షాలు కురిసి వరదలు సంభవించినప్పుడు జిల్లాలోని వివిధ ప్రాంతాలలో జరిగిన నష్టానికి సంబంధించి నివారణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో వివిధ విభాగాల ఇంజనీరింగ్ శాఖల అధికారులతో వరద నష్ట నివారణ చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో చేపట్టిన వరద నష్ట నివారణ పనులకు సంబంధించి వివరాలను ఆయా అధికారులను అడిగి తెలుసుకున్నారు. చేపట్టిన పనులను నిర్ణిత సమయంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులకు సంబంధించి సమాచారాన్ని అధికారులు కలెక్టర్ కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. చేపట్టిన పనులన్నింటినీ నిర్ణీత గడువులోగా నాణ్యవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ విభాగాల ఇంజనీరింగ్ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 15లోగా ఉపకారవేతనాల ప్రాసెసింగ్ పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ రాజర్షి షా






వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఉపకారవేతనాల విడుదల ప్రక్రియను ఈ నెల 15లోగా పూర్తిచేసి షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ లాగిన్‌కు పంపించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 202 -24, 2024-25, 2025 - 26 విద్యా సంవత్సరాలకు సంబంధించిన పోస్ట్, ప్రీ-మెట్రిక్ ఉపకారవేతనాల పురోగతిని సమీక్షిస్తూ కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డిసెంబర్ 31 తర్వాత లావాదేవీలు నిలిచిపోతాయని, ఈ లోపు విద్యార్థుల వివరాలు E-PASS లాగిన్‌లో నమోదు చేయకపోతే సంబంధిత ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రతి విద్యార్థి బ్యాంకు ఖాతా ఆధార్‌తో సీడ్ చేయడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఈ సంవత్సరం నుంచి ప్రైవేట్ పాఠశాలల్లో 9వ, 10వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు కూడా ఉపకారవేతనాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. వారి కుటుంబ వార్షిక ఆదాయం రూ. 2.50 లక్షలను మించరాదని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 4,900 మంది విద్యార్థులు అర్హులుగా గుర్తించడం జరిగిందని, వారిని వెంటనే E-PASS లాగిన్‌లో నమోదు చేయాలని మండల విద్యాధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, ఎస్సీ సంక్షేమ అధికారి సునీత కుమారి, జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి గణేష్ జాదవ్, పోస్టల్ బ్రాంచ్ అధికారి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత నాయకులపై పెట్టిన అక్రమ కేసులను కొట్టివేయాలి

## సారంగాపూర్ మండల అంబేద్కర్ యువజన సంఘం నాయకుల డిమాండ్.....




ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్న సారంగాపూర్ మండల అంబేద్కర్ సంఘం నాయకులు

నిర్మల్ / సారంగాపూర్ / నవంబర్ 4 ( అమృత్ తెలంగాణ ) నిర్మల్ జిల్లా సోన్ మండలం పాక్ పట్ల గ్రామంలో దళితుల పక్షాన నిలబడి న్యాయం కోసం ప్రశ్నిస్తున్న జిల్లా అంబేద్కర్ యువజన సంఘం నాయకుల పై అక్రమ కేసులు పెట్టడం అన్యాయం అని వెంటనే అక్రమ కేసులను కొట్టివేయాలి సారంగాపూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు పిల్లి నాగయ్యా అన్నారు, నాయకులు దేవి శంకర్ మాట్లాడుతూ దళిత నాయకులపై కేసులు వేయడం చూస్తుంటే ప్రశ్నించే నాయకుల గొంతులు నొక్కడమే అని ఖండించారు అధికారులు అక్రమ కేసులను ఎత్తివేయకుంటే మండల కేంద్రంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు నాయకులు ఈశ్వర్,దేవి శంకర్ , గొడిసిరం లింగం , దిలీప్ , సన్ని , శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో కూడిన విద్య.. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

తలకొండపల్లి:అమృత్ తెలంగాణ: క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు విద్యార్థులకు ఉంటుందని ఉన్నతి శిక్ష ఫౌండేషన్ చైర్మన్ ఎర్రం సుధాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ మేరకు పాఠశాలల్లోని ఆరు రూములకు పెయింటింగ్ వేయించారు. వాటర్ ఫిల్టర్ రిపేర్, స్పోర్ట్స్ మెటీరియల్ అందించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 5 బోర్డులు, టేబుల్స్, చైర్స్, రాక్, స్పోర్ట్స్ మెటీరియల్, ఉన్నతి శిక్ష ఫౌండేషన్ చైర్మన్ ఎర్రం సుధాకర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఉన్నతి శిక్ష ఫౌండేషన్ చైర్మన్ ఎర్రం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినిలకు మౌలిక వసతులు కల్పన లక్ష్యంగా మా ఫౌండేషన్ పని చేస్తుందన్నారు. పరీక్షలు జీవన్మరణ సమస్య కానేకాదని, ఆత్మవిశ్వాసంతో ఇష్టంతో చదివి పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. చదువుల్లో భవిష్యత్తులో రాణించాలంటే సానుకూల దృక్పథం కలిగి ఉండాలన్నారు, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులు చదువుకున్న పాఠశాలకు, మంచిగా చదువుకొని, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు,పాఠశాలకు సేవలు చేసే వారికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు తెలిపారు. విద్య అనేది విద్యార్థుల కెరీర్‌కు 'గేట్ వే' వంటిదన్నారు. కెరీర్ ప్లాన్ చేసుకొని అధ్యాపకులు ఇచ్చే సలహాలు విద్యార్థులు పాటించాలన్నారు. అనంతరం ఇరు పాఠశాలల ఉపాధ్యాయ బృందం నాయకులు ఉన్నతి శిక్ష ఫౌండేషన్ చైర్మన్ ఎర్రం సుధాకర్ రెడ్డి, ఫౌండేషన్ సెక్రెటరీ, మాజీ సర్పంచ్ బండి రఘుపతిని ఘనంగా శాలువాలతో పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఇంచార్జ్ కేశవులు,ఉన్నతి ఫౌండేషన్ కార్యదర్శి బండి రఘుపతి, ఫౌండేషన్ సభ్యులు శ్రీరామ్, రమేష్, నితిన్, మాజీ ఎంపీటీసీలు జి. శ్రీనివాసమూర్తి, అంబాజీ,నాయకులు అంజయ్యగౌడ్,పి అశోక్ బాబు, రాజు, విష్ణు, ఉపాధ్యాయులు శేఖర్, పరమేశ్, ఆదర్శరావు, శ్రీదేవి, పూర్ణిమ, ఆసియా, నాగాజ్యోతి, పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన బిజెఎల్పి నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి..



లబ్ధిదారులకు సీఎం సాయనిధి చెక్కులను అందజేస్తున్న బిజెఎల్పి నేత ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ జిల్లా నవంబర్ 4 అమృత్ తెలంగాణ నిర్మల్ నియోజకవర్గంలోని నిర్మల్ పట్టణం, నిర్మల్ రూరల్, సొన్, మామడ, లక్ష్మణచందా, దిలావర్ పూర్, నర్సాపూర్, సారంగాపూర్, మండలాలకు చెందిన 90 మంది లబ్ధిదారులకు రూ. 18,75,000/- ల చెక్కులను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పట్టణ మండల బీజేపీ నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# చికెన్ షాప్ యజమానుల కు అవగాహన కల్పించిన మున్సిపల్ కమిషనర్.







అమృత్ తెలంగాణ మెట్ పల్లి నవంబర్ 04: మున్సిపల్ కమిషనర్ టీ మోహన్ మెట్పల్లి మున్సిపల్ కార్యాలయం నందు చికెన్ సెంటర్ యాజమాన్యాలతో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చికెన్ సెంటర్ యాజమాన్లతో చికెన్ వేస్టును చికెన్ వేస్ట్ కలెక్షన్ చేసే బండికి అందజేయమని సూచించడం జరిగింది. చికెన్ వెస్ట్ బహిరంగ ప్రదేశాల్లో వేయడం వలన కుక్కల ఎక్కువ పెరగడం జరుగుతుంది. కావున పట్టణ ప్రజల ఆరోగ్యం దృశ్య చికెన్ వేస్ట్ లను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా చికెన్ వేస్ట్ కలెక్షన్ చేసుకునే బండికి ఇవ్వాలని సూచించడం జరిగింది. బహిరంగ ప్రదేశాల్లో వేస్ట్ వేస్తే జరిమానా వేస్తామని అన్నారు.

మరి ప్రతి ఒక్క చికెన్ సెంటర్ యాజమాన్లలో తమ షాప్ కి లైసెన్స్ తీసుకోమని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ అక్షయ్ కుమార్, ముజీబ్ పాల్గొన్నారు.

# వేములకుర్తిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

## కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి
## దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు
## యామపుర్ సహకారసంఘ చైర్మన్ అంకతి రాజన్న

ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ నవంబర్ 4 కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ,ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో దాన్యం విక్రయించి గిట్టుబాటు ధరలను పోందాలని జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం యామపుర్ సహకారసంఘ చైర్మన్ అంకతి రాజన్న అన్నారు. ఈసందర్భంగా వేములకుర్తి గ్రామంలో యామపుర్ సహకారసంఘ అధ్వర్యంలో వరిదాన్యం కోనుగోలు కేంద్రం ఎర్పాటు చేయగా ఇబ్రహింపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ భోరిగాం రాజు స్ధానిక నాయకులు రైతులతో కలిసి కోనుగోలు కేంద్రం ను ప్రారంభించారు. రైతులు ఆర్దిక ఎదగటం తోపాటు, వారు పండీచిన పంటను వారే నేరుగా విక్రయించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కోనుగోలు కేంద్రలను ఎర్పాటు చేసిందన్నారు. తమ ధాన్యాన్ని దళారులకు అమ్మి మెస పోకుండా ఎ గ్రేడ్ ధర 2320,బిగ్రేడ్ ధర 2300 క్వింటాలుకు పోందలన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుడ శ్రీకాంత్ రెడ్డి, విండో డైరెక్టర్ లు గడ్డం శంకర్ రెడ్డి, దోనికెన రాజేష్,




కొనుగోలు కేంద్రం ప్రారంభం చేస్తున్న చైర్మన్, రైతులు

మార్కెట్ డైరెక్టర్ గుమ్మల రమేష్, నాయకులు పెంట లింబద్రి,అభివృద్ధి కమిటీ చైర్మన్ గుమ్మల గంగన్న,రావుల గణేష్,తరి రామనుజం,బోరిగాం మహేష్, దుంపెట మహేష్, రాధరపు ప్రకాష్, గోపు రాజేంధర్,నాయిని గంగాధర్ ,విండో సిఈఓ నేమురి మహేందర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బహరేన్ లో మృతి చెందిన ఐదేళ్లకు గల్ఫ్ కార్మికుడి అంత్యక్రియలకు సన్నాహాలు.

## బహరేన్‌లో అంత్యక్రియలకు సమ్మతిస్తూ మృతిడి భార్య అఫిడవిట్ దాఖలు
## సీఎం ప్రవాసీ ప్రజావాణి ని సందర్శించిన కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్

అమృత్ తెలంగాణ మెట్ పల్లి నవంబర్ 04: ఐదేళ్ల క్రితం బహరేన్‌లో మృతి చెందిన జగిత్యాల జిల్లా మెటుపల్లి కి చెందిన శ్రీపాద నరేష్ మృతదేహం అతిశీతల శవాగారంలో మగ్గుతోంది. శవాన్ని భారత్ కు రవాణా చేయడం సాధ్యం కాదని ఇండియన్ ఎంబసీ స్పష్టం చేయడంతో. బహరేన్ లోనే అంత్యక్రియలు నిర్వహించేందుకు సమ్మతిస్తూ,మృతుని భార్య శ్రీపాద లత (మునికోట నాగమణి) నిరభ్యంతర పత్రంపై సంతకం చేశారు. తదుపరి చర్యలకు కోసం కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట సంజయ్, సీఎం ప్రవాసీ ప్రజావాణి ని సందర్శించి మృతుడి సోదరుడు ఆనంద్ తో కలిసి నోటరీ అఫిడవిట్ (నిరభ్యంతర పత్రం) ను ప్రజావాణి ఇంచార్జి డా.జి. చిన్నారెడ్డికి,తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డికి అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం, బహరేన్ లోని ఇండియన్ ఎంబసీతో సమన్వయం చేసి అక్కడే అంత్యక్రియలు జరిగేలా చూడాలని ఎమ్మెల్యే కోరారు. మృతుడి సోదరుడు ధర్మపురి ఆనంద్ బహరేన్ వెళ్ళి అంత్యక్రియలకు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై అడ్వయిజరీ కమిటీ మెంబర్లు నంగి దేవేందర్ రెడ్డి, సింగిరెడ్డి నరేష్ రెడ్డి, సామాజిక సేవకులు మొరపు తేజ,ఆకుల ప్రవీణ్,బొజ్జ అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా,బహరేన్ లోని సామాజిక కార్యకర్తలు డి.వి. శివకుమార్,కోటగిరి నవీన్ కుమార్,నోముల మురళి, భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేసి



సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నారు.

# రోడ్డెక్కిన గురుకుల పాఠశాల విద్యార్థినిలు.. ఆర్డీవో రావాలని డిమాండ్





అమృత్ తెలంగాణ మెట్ పల్లి నవంబర్ 04: జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి పట్టణం అరపేట శివారులో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఇంచార్జ్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ విద్యార్థులు జాతీయ రహదారి సంఖ్య 63 (ఆర్మూర్ – జగిత్యాల రహదారి) పై పరిటాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తక్షణమే జిల్లా ఆర్డిఓ వచ్చి తమ సమస్యలు విని, వేధింపులకు పాల్పడుతున్న ఇంచార్జ్ ప్రిన్సిపాల్‌ను తొలగించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. వారి ఆందోళనతో కొంతసేపు నేషనల్ హైవేపై ట్రాఫిక్ అంతరాయం కలిగింది. పోలీసు,విద్యాశాఖ అధికారులు అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి విద్యార్థులతో చర్చలు జరిపారు.

# జీవనశైలిలో మార్పులతోనే క్యాన్సర్లకు దూరం

నకిరేకల్: అమృత్ తెలంగాణ: ప్రతి మనిషి తన జీవనశైలిలో మార్పులు చేసుకోవడం వల్ల వివిధ రకాల క్యాన్సర్లతో పాటు బ్రెస్ట్ క్యాన్సర్‌కు దూరంగా ఉండవచ్చని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి వేముల పుష్ప, ఐఎంఏ నకిరేకల్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాపోలు రఘునందన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక శ్రీ శ్రీనివాస నర్సింగ్ హోంలో డాక్టర్ రాపోలు ఫౌండేషన్, నల్లగొండ ఓబిజీ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మహిళలకు, పురుషులకు హెచ్‌బీ, ఆర్‌బీఎస్, బీఎండీ, టీ–3, టి–4, టిఎస్ హెచ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవన విధానంలో కొత్త పోకడలు కాకుండా పూర్వ పద్ధతులు పాటించాలన్నారు. వంట పాత్రలు ప్లాస్టిక్ కాకుండా ఇత్తడి, స్టీలు వంటివి వాడటం వల్ల క్యాన్సర్ కు దూరంగా ఉండవచ్చని పేర్కొన్నారు, శారీరక శ్రమ, నిద్ర, ఒత్తిడి, ఆల్కహాల్, ధూమపానం, శీతల పానీయాలను నియంత్రించుకోవాలన్నారు. డాక్టర్ రాపోలు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రాపోలు మంజుల రఘునందన్ మాట్లాడుతూ బ్రెస్ట్ క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించి నయం చేసే ముందస్తు పరీక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను 10 నుండి 45 సంవత్సరాల వయస్సు గల వారు వేయించుకోవచ్చన్నారు. ఈ శిబిరంలో 200 మంది పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐఓఎన్ క్యాన్సర్ హాస్పిటల్ ఆంకో సర్జన్ డాక్టర్ వినయ్, మునిసిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ మురారిశెట్టి ఉమారాణి కృష్ణమూర్తి, శ్రీనివాస నర్సింగ్ హోమ్ సిబ్బంది పాల్గొన్నారు.

# అంత్యక్రియలకు వెళ్లి అనంత లోకాలకు...

## ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యానికి ఒకరు మృతి పలువురికి తీవ్ర గాయాలు.....
## కేసు నమోదు చేసి విచారణ జరుగుతున్న ఎస్సై గణేష్....




టాటా మ్యాజిక్ ను ఓవర్టేక్ చేసిన ట్రాక్టర్




ప్రమాదంలో నుజ్జు నుజ్జైన టాటా మ్యాజిక్

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి, నవంబర్ 4 అమృత్ తెలంగాణ మామడ మండలంలోని కోరిటికల్ గ్రామానికి చెందిన రాజేశ్వర్, తన టాటా మ్యాజిక్ వాహనంలో అదే గ్రామానికి చెందిన కొంతమందిని తీసుకొని అంత్యక్రియలు నిమిత్తం కాంబోలి గ్రామానికి వెళ్లడం జరిగింది . అంత్యక్రియలు ముగించుకొని తిరిగి తన గ్రామానికి వెళ్తుండగా టాటా మ్యాజిక్ వాహనము మార్గమధ్యలో రాంపూర్ గ్రామ శివారులో రైస్ మిల్ దగ్గర మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో నర్సాపూర్ జి వైపు నుండి నిర్మల్ వైపు వెళుతున్న ట్రాక్టర్ దాని డైవర్ శంకర్ ట్రాక్టర్ ను అతివేగంగా అజాగ్రతగా నడుపుతూ టాటా మ్యాజిక్ ను ఓవర్టేక్ చేయడంతో టాటా మ్యాజిక్ ను ఢీకొట్టడంతో టాటా మ్యాజిక్ అదుపుతప్పి రోడ్డు పక్కన గల చెట్టును ఢీకొట్టడంతో టాటా మ్యాజిక్ నడుపుతున్న రాజేశ్వర్ కు కాళ్లకు ఛాతికి అందులో ప్రయాణిస్తున్న చిన్న రెడ్డి, కి మరి కొంతమందికి కూడా గాయాలు కావడంతో . వెంటనే నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం 6 గంటల సమయంలో టాటా మ్యాజిక్ డ్రైవర్ కటికనపల్లి రాజేశ్వర్ 50 మృతి చెందినట్లు అతని కుమారుడు సంజీవ్ దరఖాస్తు చఇవ్వగ ఎస్సై గణేష్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టినారు.

# రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పథ సంచలన్......
## పాల్గొన్న బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి,



ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాల శతాబ్ది వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు





ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాల శతాబ్ది వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి,

నిర్మల్ జిల్లా నవంబర్ 4 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా కేంద్రంలో మంగళవారం రోజు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్మల్ నగర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పథ సంచలన్ కార్యక్రమంలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు కాలనీల గుండా నిర్వహించిన పథ సంచలన్ లో పాల్గొన్నారు. దేశ సేవలో ఆర్ఎస్ఎస్ పాత్ర ఎంతో కీలకమని అన్నారు. స్వయంసేవకులు ఎన్నో విపత్తుల్లో స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ , జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, ముఖ్య అతిథులు శ్రీరామ్ భరత్ జి, రిటైర్డ్ ఐపీస్ ఎంకే సింగ్, చిటికేశ్ శ్రీనివాస్, నగర్ సంచాలక్ డా. ప్రమోద్ చంద్రారెడ్డి, స్వయం సేవకులు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటిన బీసీ విద్యార్థి నాయకుడు.

అమృత్ తెలంగాణ మెట్ పల్లి నవంబర్ 04: మెట్పల్లి పట్టణం దుబ్బవాడలో మరోసారి మానవత్వం చాటిన జగిత్యాల జిల్లా బీసీ విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు జెట్టి నరేంద్ర. వివరాల్లోకి వెళితే పట్టణంలోని దుబ్బవాడలో నరేంద్ర తన ఇంటి నుండి బయటకు వెళ్ళేటప్పుడు ఇంటి ముందర ఎవరిదో ఫోన్ పడిపోయినట్లుగా గమనించాడు,దానిని తీసి వెంటనే చుట్టుపక్కల వారిని వివరాలు అడగగా ఎవరు మాకు తెలియదు అన్నారు. కానీ తను ఆ వస్తువుని స్వార్థంగా వాడుకోక మానవత్వం తో తీసుకువెళ్లి స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై కి అందించారు. అనంతరం Si నరేందర్ మానవత్వం గురించి మాట్లాడుతూ అతనిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జెట్టి నరేంద్ర తో పాటు బీసీ నాయకులు ఎండి ముక్తార్ బాయ్,జెట్టి నరేష్, పాల్గొన్నారు.



# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిక్ క్యాంపు



ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ నవంబర్ 4 మెట్పల్లి లయన్స్ క్లబ్ ఆఫ్ అధ్యక్షులు శ్రీ వెల్మల శ్రీనివాసరావు గారి ఆధ్వర్యంలో మంగళవారం 4.11.25 ఇబ్రహీంపట్నం గ్రామం లో ని కొత్త బస్టాండ్ ఆవరణలో ఉదయం 7.30 నిమిషములకు ఉచిత డయాబెటిక్ క్యాంపు జరిగింది ఇట్టి ఉచిత డయాబెటిక్ క్యాంపులో 125 మంది పాల్గొన్నారు. 15 మంది పేషంట్లను గుర్తించి నాము ఇట్టి ఉచిత డయాబెటిక్ క్యాంప్ లో మెట్పల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు శ్రీ వెలుముల శ్రీనివాసరావు గారు, దొంతుల ఆంజనేయులు గారు మరియు డాక్టర్ చిన్నయ్య మారుతి తదితరులు పాల్గొన్నారు

## సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న మాజీ మంత్రి జోగు రామన్న దంపతులు



పూజలో పాల్గొన్న మాజీ మంత్రి జోగు రామన్న దంపతులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మాజీ మంత్రి జోగు రామన్న సతీమణి రమాదేవితో కలిసి సత్యనారాయణ వ్రతాన్ని ఆచరించారు. జిల్లా ప్రజలకు కార్తీకమాస శుభాకాంక్షలు తెలియజేశారు.. సనాతన హిందూ ధర్మం లో సత్యనారాయణ వ్రతం ఎంతో ఎంత ప్రాముఖ్యతను పొంది ఉంది అన్నారు. ఆధ్యాత్మిక మార్గంలో శాంతి స్థాపనతో పాటు మానసిక ప్రశాంతత కొరబడుతున్నాయి పేర్కొన్నారు.. ఇలాంటి కార్యక్రమాలను ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ మరిన్ని తరాలకు భక్తి మార్గాన్ని చూయిస్తూ స్ఫూర్తిగా నిలవడం జరుగుతుందన్నారు.

## ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలి

మిర్యాలగూడ అమృత్ తెలంగాణ: పెండింగ్లో ఉన్న ఫీజు రీఎంబర్స్మెంట్ స్కాలర్షిప్ విడుదల చేయాలని ప్రయివేట్ కళాశాలల అధ్యాపకులు మంగళవారం నిరసన తెలిపారు. సాగర్ రోడ్ లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ.. గత నాలుగు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల కాకపోవడంతో కళాశాలల యాజమాన్యం కళాశాలలను నడపలేకపోతుందని తెలిపారు. తాము ఎన్నో ఏళ్లుగా కళాశాలలో నమ్ముకుని విద్య బోధన చేస్తున్నామని ఫీజు రీయింబర్స్మెంట్ రాని కారణంగా మాకు జీతాలు కూడా ఇవ్వడం లేదని చెప్పారు. దీనివలన మా కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రియంబర్స్మెంట్ పెండింగ్ ఉండడం వల్ల జీతాలు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తక్షణమే ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేసి మా జీవితాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మధు, శ్రీనివాసు, ప్రభాకర్, యాదయ్య, దుర్గయ్య, హరికృష్ణ, రమేష్, రాజారామ్, వెంకట సతీష్, జ్యోతి, సైదమ్మ, స్వామి, సైదాచారి, వెంకటయ్య, వీరయ్య, వాసు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లాలో ఉన్న దేవాలయాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు

భక్తుల రద్దీకి ముందస్తు చర్యలు - జిల్లాలో భద్రతా ఏర్పాట్లు పూర్తి
భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు
జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల,



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి జిల్లా వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు విచ్చేసే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని, పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ తెలిపారు. ప్రధానంగా బాసర సరస్వతి దేవి ఆలయం, తానూర్ లోని విఠలేశ్వర స్వామి ఆలయం, కదిలి పాపహరేశ్వర ఆలయం, నిర్మల్ పట్టణంలోని నగరేశ్వర స్వామి ఆలయం, దేవర కోట దేవస్థానం, వెంకటాపూర్ లోని మహదేవ ఆలయం, శివకోటి మందిరాలు వంటి ప్రధాన దేవాలయాలలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని ఎస్పీ తెలిపారు ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈ ఆలయాలకు వెయ్యికి పైగా భక్తులు విచ్చేస్తారని, అందువల్ల పోలీస్ శాఖ ముందస్తు చర్యలు తీసుకొని పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, పార్కింగ్ సదుపాయాలు, మహిళల భద్రతకు ప్రత్యేక సిబ్బంది, సీసీ కెమెరా పర్యవేక్షణ, పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలియ జేయడం జరిగింది.

## విపత్తులపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దవంగర: విపత్తుల నిర్వహణ పై అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా సహకార అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వేణుమాధవ్, తహశీల్దార్ మహేందర్తో కలిసి మంగళవారం విపత్తు నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. వరద నీటిలో ప్రవేశించవద్దని, వరద నీటిలో నడవొద్దన్నారు.

## అధికారుల నిర్లక్ష్యం గ్రామ నాయకుల ఆదర్శం

### సొంత ఖర్చులతో స్వచ్ఛందంగా రోడ్డు మరమ్మత్తులు చేసిన వర్షకొండ గ్రామనాయకులు

ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ నవంబర్ 4 ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని వర్షకొండ - ఇబ్రహీంపట్నం ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఈ రోడ్డుపై ప్రతిరోజు ప్రయాణించే వాహనదారులు తరచుగా ప్రమాదాలకు గురవుతుండడంతో, స్థానిక నాయకులు ముందడుగు వేసి శ్రమదానానికి దిగారు. అధికారులు పలుమార్లు దృష్టికి తీసుకెళ్లినప్పటికీ చర్యలు లేకపోవడంతో, వర్షకొండ గ్రామ నాయకులు స్వచ్ఛందంగా రోడ్డుపై గుంతలను పూడ్చే పనిని చేపట్టారు. తమ స్వంత ఖర్చుతో బొల్లవేయిన శంకర్ JCB, జంగ విజయ్ ట్రాక్టర్, దొంతుల తుక్కారం ట్రాక్టర్ సహాయంతో గుంతల్లో మొరంను వేసి రహదారిని సరిచేశారు. స్థానికులు మాట్లాడుతూ "అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డు ప్రమాదాలు పెరిగిపోయాయి. గ్రామ నాయకుల ఈ శ్రమదానం ప్రజలకు ఆదర్శం" అని అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో దొంతుల తుక్కారం, మామిడి సురేశ్ రెడ్డి, బొల్లవేయిన శంకర్, గుజ్జరి ప్రకాష్, దోమకొండ రాజన్న, జంగ విజయ్ తదితరులు పాల్గొన్నారు.







రోడ్డును మరమ్మత్తులు చేస్తున్న గ్రామ నాయకులు

## ఘనంగా యాదవుల సదర్ సమ్మేళనం

చౌటుప్పల్ రూరల్: అమృత్ తెలంగాణ: చౌటుప్పల్ మండలం దండు మల్కాపూరం గ్రామంలో శ్రీ గోపాలకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా యాదవుల సదర్ సమ్మేళనం నిర్వహించారు. తోలుత దున్నరాజులకు అలంకరణ పూజలు చేసి సభ ప్రాంగణంకి డీజే శబ్దలతో తీసుకొచ్చారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథులుగా యాదవ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు చిలకల శ్రీనివాస్ యాదవ్ యాదవ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుండెబోయిన అయోధ్య యాదవ్ యాదవ సంఘం మండల అధ్యక్షుడు చినుకని మల్లేశం



యదవ్,బండారి నర్సింహా, మల్లికార్జున దేవస్థాన కమిటీ అధ్యక్షుడు ఆవుల ఏసు యాదవ్,పాక చిరంజీవి యాదవ్,పబ్బు రాజు గౌడ్,అందోల్ మైసమ్మ చైర్మన్ చిలుకురి మల్లారెడ్డి,కంచర్ల గోవర్ధన్ రెడ్డి,ఉపసర్పంచ్ మల్కాజ్గిరి కృష్ణ హాజరయ్యారు.పాల్గొని మాట్లాడారు యాదవ ఐక్యత సదర్ సమ్మేళనం వేడుక అని తెలిపారు.

## ఏంటి జాన్వి ఫన్ కోసమే అలా చేస్తుందా..?



బాలీవుడ్ స్టార్ తనయ జాన్వి కపూర్ సినిమాతో ఈక్వల్ గా సోషల్ మీడియాలో తన పాపులారిటీ చూపిస్తుంది. సినిమాల లెక్క ఎలా ఉన్నా సరే సోషల్ మీడియా క్రేజ్ తోనే ఆమె అదరగొట్టేస్తుంది. అయితే జాన్వి మాత్రం రివర్స్ లో తను సోషల్ మీడియాని అసలు పట్టించుకోనని అంటుంది. జాన్వి కపూర్ ఇన్ స్టాగ్రాం లో 20 మిల్లియన్లకు పైగా ఫాలోవర్స్ ఉన్నారు. వారిని అలరించేందుకే రకరకాల ఫోటో షూట్స్ చేస్తుందేమో అనుకుంటే అసలు తను సోషల్ మీడియాని పట్టించుకోను.. తను కేవలం ఫన్ కోసమే ఫోటోలని సోషల్ మీడియాలో షేర్ చేస్తానని అంటుంది. గ్లామర్ ట్రీట్ తో ఫాలోవర్స్ ని వెర్రి వాళ్లని చేస్తున్న జాన్వి ఈ ఫోటోలు కేవలం ఫన్ కోసమే అంటూ చెప్పి షాక్ ఇచ్చింది. తను ఎంత సరదాగా ఫోటోలు షేర్ చేసినా ఫాలోవర్స్ మాత్రం వాటిని చాలా సీరియస్ గా ఫాలో అవుతున్నారు. జాన్వి ప్రతి ఫోటో షూట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ వస్తున్నాయి. గ్లామర్ ఎటాక్ లో జాన్వి తన ప్రత్యేకతని చూపిస్తుంది. స్టార్ కూతురు అయ్యుండి ఇలా రెచ్చిపోతే నెటిజెన్లు దారుణంగా కామెంట్స్ చేస్తారని తెలిసినా తను అనుకున్నది చేయడంలో వెనక్కి తగ్గట్లేదు జాన్వి కపూర్. అయితే ఈ ఫోటోలు అంతా కూడా తను కావాలని కాకుండా చాలా సరదాగానే షేర్ చేస్తున్నా అని చెప్పుకొచ్చింది. రీసెంట్ గా మిలి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన జాన్వి ఆ సినిమా ఫలితం ఎలా ఉన్నా ఆమె నటనకు మంచి మార్కులు కొట్టేసింది. ఇక సౌత్ సినిమాల మీద జాన్వి ప్రత్యేక ఆసక్తి చూపిస్తుంది. ఛాన్స్ వస్తే తెలుగు సినిమాలో చేయాలని అనుకుంటుంది అమ్మడు. ఇక్కడ ఎన్.టి.ఆర్ తో జత కట్టాలని జాన్వి ఇంట్రెస్ట్ చూపిస్తుంది. సినిమాల్లో కన్నా జాన్వి తన ఫోటో షూట్స్ లోనే తన అందాలకు పని చెబుతుంది. గ్లామర్ షో విషయంలో తనకంటూ ఒక పర్ఫెక్ట్ స్కెచ్ ఉన్నట్టుగా జాన్వి మాటలని బట్టి అర్ధమవుతుంది. రోజు రోజుకి తన స్కిన్ తోనే ఫాలోవర్స్ ని తన బుట్టలో పడేసుకుంటున్న అమ్మడు సినిమా ఫలితాలతో సంబంధం లేకుండా తన క్రేజ్ కొనసాగిస్తుంది.

## టాలీవుడ్‌పై చాలా ఆశలు పెట్టుకుంది..!

ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తాను టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌ను అని, తనకు తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి అధికంగా ఆఫర్లు వస్తున్నాయని చెప్పుకొచ్చింది. మెగాస్టార్ చిరంజీవితో 'వాల్తేరు వీరయ్య' సినిమాలో బాస్ పార్టీ, బాలకృష్ణతో 'డాకు మహారాజ్' సినిమాలో దబిడి దిబిడి సాంగ్ చేయడం ద్వారా టాలీవుడ్‌లో మోస్ట్ పాపులర్ ఐటెం సాంగ్ హీరోయిన్‌గా ఊర్వశి రౌతేలా నిలిచింది. ప్రస్తుతం టాలీవుడ్‌లో స్టార్ హీరోల సినిమాల్లో ఐటెం సాంగ్ అనగానే ఈ అమ్మడి పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. ఊర్వశి రౌతేలా మాస్ ఐటెం సాంగ్స్‌కి మంచి స్పందన వచ్చింది. ఇప్పటి వరకు తెలుగులో ఈమె చేసిన దాదాపు అన్ని సాంగ్స్ మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో ఎక్కువ ఆఫర్లు వస్తున్నాయి. పైగా హీరోయిన్స్ రేంజ్‌లో ఈమె పారితోషికంను అందుకోవడం కూడా కలిసి వచ్చే అంశంగా చెప్పుకోవచ్చు. పారితోషికం భారీగా దక్కుతున్న నేపథ్యంలో టాలీవుడ్‌లో ఐటెం సాంగ్స్ చేసేందుకు ఈమె చాలా ఆసక్తిగా ఉంది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తాను టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌ను అని, తనకు తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి అధికంగా ఆఫర్లు వస్తున్నాయని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం టాలీవుడ్‌లో తాను బిజీ స్టార్ అన్నట్లుగా జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన గొప్ప తాను తెగ చెప్పుకుంది. చాలా మంది దర్శకులు నన్ను సంప్రదించేందుకు ప్రయత్నిస్తున్నారు. వారి సినిమాల్లో నన్ను నటింపజేసేందుకు పోటీ పడుతున్నారంటూ కాస్త అతిగా వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుతం ఊర్వశి రౌతేలా చేసిన ఈ వ్యాఖ్యల గురించి ఇండస్ట్రీలో చర్చ జరుగుతోంది. 60 డేస్ ప్లాన్! డాకు మహారాజ్ తర్వాత ఊర్వశి కొత్త సినిమాలతో వచ్చిందే లేదు. బ్లాక్ రోజ్ అనే సినిమాలో నటిస్తుంది. కానీ అది ఎప్పటికీ వస్తుంది అనే విషయమై క్లారిటీ లేదు. అయినా కూడా ఈ అమ్మడు టాలీవుడ్‌లో తనకు వచ్చే అవకాశాల గురించి, ముందు ముందు చేయబోతున్న సినిమాల గురించి చాలానే ఆశలు పెట్టుకుని ఉంది. హిందీలో ప్రస్తుతం రెండు సినిమాల్లో నటిస్తున్నప్పటికీ టాలీవుడ్ పైనే ఈమెకి మోజు ఎక్కువగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఐటెం సాంగ్స్ స్పెషలిస్ట్‌గా పేరు



దక్కించుకున్న ఈ అమ్మడు హీరోయిన్‌గానూ ఆఫర్లు వస్తాయేమో అనే నమ్మకంతో కనిపిస్తుంది. ముందు ముందు ఈ అమ్మడి జోరు ఏ రేంజ్‌లో ఉంటుందో చూడాలి. 2013లో సింగ్ సాబ్ ది గ్రేట్ అనే సినిమాతో బాలీవుడ్‌లో అడుగు పెట్టిన ఈ అమ్మడు దశాబ్ద కాలంలోనే అత్యధిక సినిమాల్లో నటించి మెప్పించింది. పలు సినిమాల్లో గెస్ట్ అప్పియరెన్స్, ప్రత్యేక సాంగ్స్ చేయడం ద్వారా కూడా మరింతగా పాపులారిటీని సొంతం చేసుకుంది. తమిళ్‌లో ఈమె ది లెజెండ్ అనే సినిమాలో ముఖ్య పాత్రలో నటించింది. ఆ తర్వాత తమిళ్ నుంచి ఆఫర్లు వచ్చినా కొన్ని కారణాల వల్ల తిరస్కరించినట్లు సమాచారం అందుతోంది. మొత్తానికి ఊర్వశి రౌతేలా హిందీ, తమిళ్, తెలుగు, బెంగాలీ భాషల్లోనూ నటించడం ద్వారా పాపులారిటీ సొంతం చేసుకుంది. కానీ ప్రస్తుతం ఈమెకు ఉన్న క్రేజ్ నేపథ్యంలో తెలుగు సినిమాలను ఎక్కువ చేయాలని ఆశ పడుతోంది.

## మమితా బైజు డిమాండ్ బాగుంది..!



ఐతే ఎవరైనా హీరోయిన్ తెలుగులో కాస్త క్రేజ్ తెచ్చుకుంటే చాలు వాళ్లకి వరుస ఆఫర్లు వస్తాయి. ప్రేమలు సక్సెస్ తో మమితాకు అలాంటి ఆఫర్లు వచ్చాయి. ప్రేమలు సినిమాతో సౌత్ లో సూపర్ క్రేజ్ తెచ్చుకుంది క్యూట్ బ్యూటీ మమితా బైజు. దాదాపు ఏడెనిమిది ఏళ్లుగా మళయాళంలో నటిస్తూ వచ్చిన మమితా బైజు అక్కడ ఒక మోస్తారు క్రేజ్ తో కెరీర్ కొనసాగిస్తుండగా ప్రేమలు సినిమా ఎప్పుడైతే రిలీజైందో అప్పటి నుంచి అక్కడ మిగతా భాషల్లో కూడా అమ్మడి పాపులారిటీ పెరిగింది. తన క్యూట్ లుక్స్ తో యూత్ ఆడియన్స్ కి ఫేవరెట్ హీరోయిన్ అయ్యింది మమితా బైజు. ప్రేమలుతో తెలుగు యువత మనసులు కూడా గెలుచుకుంది ఈ చిన్నది. ఐతే ఎవరైనా హీరోయిన్ తెలుగులో కాస్త క్రేజ్ తెచ్చుకుంటే చాలు వాళ్లకి వరుస ఆఫర్లు వస్తాయి. ప్రేమలు సక్సెస్ తో మమితాకు అలాంటి ఆఫర్లు వచ్చాయి. కానీ అప్పటికే ఆమె తమిళం, మలయాళ భాషల్లో సినిమాలు ఒకే చేయడం వల్ల ఇక్కడ సినిమాలు కుదరలేదు. ఐతే మమితాకు కూడా పర్సనల్ గా తెలుగు సినిమాల్లో నటించాలన్న ఆలోచన ఉందని తెలుస్తుంది.




## చూపు తిప్పుకోనివ్వని అందం.. 90ఎంఎల్ ఇచ్చినంత కిక్



తెలుగు లో 90ఎంఎల్ సినిమా తో పాటు ఛలో ప్రేమిద్దాం సినిమాలను చేసిన ముద్దుగుమ్మ నేహా సోలంకి. ఈ అమ్మడు మెల్ల మెల్లగా టాలీవుడ్ ప్రేక్షకులకు చేరువ అవుతోంది. అందమైన ఈ అమ్మడి యొక్క అందాల గురించి ఎంత మాట్లాడుకున్నా తక్కువే అన్నట్లుగా ఈ ఫోటో చూస్తుంటే అనిపిస్తుంది అంటూ కామెంట్స్ వస్తున్నాయి. సోషల్ మీడియాలో ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోత పీక్స్ లో ఉంది. తాజాగా ఈ ఫోటోను షేర్ చేసి తనకంటే గొప్ప అందగత్తె ఉందా అన్నట్లుగా నేహా సోలంకి ఛాలెంజ్ విసిరినట్లు గా ఉందంటూ కామెంట్స్ వస్తున్నాయి. ప్రస్తుతం ముద్దుగుమ్మ యొక్క అందం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. క్లీ వేజ్ షో తో పాటు నడుము అందం ను సైడ్ యాంగిల్ లో చూపిస్తూ మతులు పోగొడుతున్న ముద్దుగుమ్మ అందాల విందు కు ప్రతి ఒక్కరు కూడా ఫిదా అవుతున్నారు. ఈ అమ్మడి యొక్క సినిమాల విషయానికి వస్తే గూడుపుఠాణి సినిమాలో నటిస్తోంది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com